# శకునము

**భా.**బు. అను ఆయనకు శకునము లనిన పిచ్చిపట్టుదల. ఆయన పయనమగువేళ కనుచూపు మేరలో విధవగాని, చెవి వినుమేరలో తుమ్ముగాని కూడదు. కర్మము చాలక ఒంటి బ్రాహ్మణుడుగాని విధవగాని (అందగత్తె యయినను సరేయని కొందఱందురు) ఎదురుపడుచో - ముందు తన మాట యెటులున్నను - వారికి మాత్రము కీడే! తుమ్మినవారు చాల కాల మేడ్వవలసినవారే. శ్రీ భా.బు. గారు పరాక్రమశాలురు. కావున "తమరే మా కపశకున"మని ఎవరును అనలేకపోయెడువారు. అది యటుండె. ఈ వరుసను భా.బు.గారి పయన మొక్కొక్కతూరి - అది యెంత యావశ్యకమయినను - నెలల తరబడి - తోసికొని పోయెడిది.

భా.బు. గారి యింటికి సుమారు నూఱుగజముల దూరమున నెదురుగా నొక రచ్చ యరుగుండెడిది. చింతచెట్టొకటి దానికి ఛత్రము. మే మచటఁ గూరుచున్నంత కాలము ఛత్రపతిత్వ మనుభవించుచుండెడివారము.

ఒకనాడు భా.బు. గారు పయనమయిరి కాబోలు, తొంగి తొంగి చూచుచు తమ ఇంటిమెట్లు దిగుచుండిరి. నే నది చూచి ముక్కు నలుపుకొని తుమ్మితిని. భా.బు. గారు ఏడవ అర్థము సెప్పుచు లోనికేగిరి. రెండు మూడు తడవలిటులు చేసితినిగాని వారి మనసు మార్చలేకపోతిని. కారణమూహించుట కడుసులభము. వారు ఏ పనికై పయనించుచున్నారో ఆ పనినెఱవేరునటులు గూడఁ జూడఁగలుగుచో వారికీ తుమ్ములో నేమియు లేదని తోచును. గాని, ఊరక తుమ్ముచు గూరుచున్నచో నేమి లగ్గు? ఈ విషయము నా కపుడు తట్టలేదు.

"శి" అను వారొకరీవిషయమున ప్రచండులు. వారెపుడు బయలు దేరినను నే నెదురు. వారు నా నిమిత్తముగా పగట పయనించుట మానిరని తెలిసి నేను నా యీ మిత్రుని కెదురుసనుట మానుకొనవలసి వచ్చెను. ఇచటఁ గూడ నా సదుద్దేశము నెఱవేఱలేదు. ఏల అని యుందురా? వినుడు. మీ రెక్కడికి విజయము చేయుచున్నారు? ఎందులకు? అని నేనడుగుగా - ఇటు లడుగుట అపశకునములలో పెద్ద అపశకునమని నాకు తెలియదు, తెలియనే తెలియదు - వారు మఱి మాటాడక మూతి ముఱకటించుకొనుచుండెడివారు.

ఒకనాడు నేనును శ్రీ.శో.గారును, మాటాడుచుంటిమి. శ్రీవారు వేషభాషలలో తెల్లదొరలు, మనసులో మాంధాతలు.

మా ఆసుపత్రిలో దొర కిరస్తానీ, దీర్ఘ వ్యాధిగ్రస్తునికడ మందు నూతిపోయుటకు బదులు బైబిలు నూతిపోయుచున్నాడు.

"అయ్యా, మంచి పనియే చేయుచున్నాడు."

"మీరు గూడ ఒక బైబిలు కొనుడు."

"అయ్యా నా కా దృశ్యము చూడవలయునని కలదు."

"ఓరీ, డ్రైవరును పిలుపుము. ఆగుమాగుము. నేడు వర్జ్య మెపుడో" నాకు నవ్వు వచ్చెను.

"ఏమిటండి నవ్వెదరు? మొన్న మా నాయనను – కుమారుని – "పోవలదయ్యా" అని అంటిని, వెళ్ళరు గదా అని అనుకొంటిని. నాకు తెలియకుండా వారు వెళ్ళిరి. ఏమాయెనో చూచితిరా? వారి మోటారు ఒకచెట్టును ఢీ కొట్టెను. చెట్టు కొంతచెడెను. మోటారు కొంత మొక్కపోయెను. వీరి యొడలు కొంత నలిగెను. పంచాంగము తీసి చూసితిని వర్జ్యము. నాటంగోలె. మీరు వర్జ్యములో కదలరు. మీకు కూడ నొక తూరి ఆ సంబరము –"

"ఆ మోటారుతోపాటు బయలుదేరిన అన్ని మోటారులకు ఆ సంబరము కలిగినదా?"

"వర్జ్యపు గడియలు 2 1/2 ఏదో ఒక రెప్పపాటు కాలము విషకాలమందు రండీ! ఆ మోటారు అప్పుడే బయలుదేరి యుండును."

"చిత్తము, వాదమున కొప్పుకొందును. చూడుడు. వర్జ్యమని చెప్పబడు ఆ 2 1/2 గడియల కాలములో ప్రతి రెప్పపాటు కాలమునను కొన్ని వందల వాహనములను బయలు దేరదీసి వానిలో నూటికి తొంబదికి ఆ వైభవము పట్టినచో, అపుడు ఆ కాలము వర్జ్యమని నిర్ధారించుట శాస్త్రీయము గాని గతానుగతికముగా, నమ్మివైచుటకు నా మనస్సు తిరస్కరించును."

"ప్రాచీను లటులు చూడకుండ అసత్యములు పలికి దైవస్వరూపమగు కాలమును దయ్యముగా చూపి ప్రజలను భయపెట్టిరని మీ యూహయా?"

వర్జ్యకాలమే కార్యారంభమునకును పనికిరాదని లోకుల మీద భయమును రుద్దువారు – చనిపోయిన ప్రాచీనులను దాలుగా పెట్టుకొనుట కంటె తమ చేతిలోపని ఎక్స్‌పరిమెంట్ చేసి చూసి ప్రజలకు నత్య పరిచయము చేయవలయును."

"ఔనండి, ఇట్టివెన్నని చేయగలము?"

"ఔను; కాలపరిక్షయము బుద్ధి పరిక్షయము చేసికొని అంధదైవము నసరత మారాధించుచుఁ గూరుచుండగలము చీనావారికయినను చేతన కలుగును గాని భారతీయులకు..."

మా యీ ప్రసంగమధ్యమున డ్రైవరు వర్ష్యమును మూటకట్టుకొని వచ్చెను.

"గార్గ్య సిద్ధాంత మత ముషకాల కలన
శకున మనుట యది బృహస్పతి మతంబు
వ్యాసమతము మనః ప్రసాదాతిశయము
విప్రజన వాక్యమరయంగ విష్ణుమతము."

అని నేను చదివితిని. వారు మోటారుబీగమును డ్రైవరు నడిగి జేబులో దాచికొనిరి.

నే నింజరమున ఒకానొక రాత్రి చదువుకొనుచుండగా భట్నవల్లి నుండి ఒక విద్యార్థి వచ్చి "ఆ శాస్త్రికి పదిలంఘనములు. రోగము విషమముగా నున్నది. గురుచరణులు వెంటనే మిమ్ము రమ్మని పంపిరి" అని చెప్పెను.

సూర్యుడుదయింపగనే నేను బయలుదేరితిని. పదియేండ్లకన్య యొకతె నా కెదురాయెను. నా చుట్టునున్న వారందరును హర్షించిరి.

నేను ముక్కుకు సూటిగా పోవుచుంటిని. గోదారిపాయలో నావ చెడిపోయెను. ఈది దాటితిని. బండి దొరకలేదు. ఎట్లో రోగి కడకు వెళ్ళితిని. నన్ను చూచి రోగి "అమ్మ ఇక బెంగలేదు" అని అనెను. అది సంధి మాట!

అమలాపుర మక్కడికి దాపు. వైద్యుని కొరకు పోతిని. అతడు ముస్లిము. యల్.యమ్.యస్. అతడపుడు క్షౌరములో నుండెను. నేను నా తొందరలో పరిచయ వాక్యములు చెప్పి రోగి లక్షణము లేకరువు పెట్టుచుంటిని. "అయ్యా, ఇది అమంగళ సమయము" అని అతడనెను.

"ఇదేమిటండీ ఇది మంగళకర్మ" అని నేనంటిని.

"కర్మ మంగళకర్మయేగాని ఆ కర్మ జరుగుచున్న కాలము మీరు వచ్చిన పని కమంగళము. మీ వైద్యగ్రంథములో మీరెచటను చూడలేదా?"

నే నేమో పీర్ల పండుగ చేసికొనుచున్నటులును, ఆయన యేమో ఏకాదశీవ్రత మనుష్ఠించుచున్నటులును నాకు తోచెను. ఈ నా యవస్థ నాతడు కనుగొనెనేమో "అది టైఫాయిడ్. పైగాసంధి. మీరు అంగడికి పోయి బ్రాంది కొనిరండు" అనెను. అంగడికి పోయితిని. అంగడివాడు సీసా తీయుచుండగా చేయిజారెను. సీసా ముక్కలై బ్రాంది

యంతయు నేలపాలాయెను. అంగడిలో మరొకసీసా లేదు. ఉత్తచేతులతో వైద్యునింటికి మఱలితిని. అతడిది విని "ఎట్టి అపశకునమండీ" అని అనెను.

"సరియ కాని బయలు దేఱుఁడు."

"ఇంకను బయలుదేఱు మందురా?"

"అపశకునములు కూడ నిదానకోటిలో చేరుట ఇటు వైద్యశాస్త్రమునకును ఆరోగ్యముకాదు. అటు జ్యోతిషమునకు వెలుఁగు కాదు."

"మీ రెంత తార్కికులండీ; ఏశాస్త్రమున కాశాస్త్రము వేఱుకాదండీ. ఒకదానితో అన్నిటికిని సంబంధము కలదండీ. ఐనా నాకేమీ తెలియును లెండు పోదము."

మే మింటికి చేరుసరికిరోగి మింటికిఁ జేరెను.

• ఢంకా •